క్లుప్తంగా

విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త దృష్టికి ట్రస్ట్ సేవలు



బొత్స ఝాన్సీని సత్కరిస్తున్న నూతన్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : నూతన్ సేవా ట్రస్ట్ చైర్మన్ సతివాడ ఈశ్వరరావు, సతివాడ యశోద అరుణ్‌రాజ్ తమ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సతీష్, మనోజ్, శ్రీను పాల్గొన్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఏడాది శివరాత్రి రోజు జరిగే అమ్మవారి ఉత్సవాలకు ప్రత్యేకత ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కూడా సామాజిక తనిఖీలు

మహారాణిపేట : జిల్లాలో రబీ 2023–24 సీజన్‌కు సంబంధించి ఇ–క్రాప్ ముసాయిదా జాబితా మీద ఆదివారం కూడా సామాజిక తనిఖీ కోసం గ్రామసభలో ప్రదర్శన ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఇ–క్రాప్ రబీ సీజన్ సవరణకు ఇదే చివరి అవకాశం అని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయడానికి వీలు లేదన్నారు. జిల్లాలో 2023–24 రబీ సీజన్‌లో 4496 ఎకరాల ఇ–క్రాప్ నమోదు చేశామని, ఇందులో 4473 ఎకరాలకు 2673 మంది రైతులకు ఈకేవైసీ చేశామన్నారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే అధికారులను సంప్రదించి రాత పూర్వకంగా తెలపాలన్నారు. రైతు భరోసా కేంద్రం అధికారి ఈ అభ్యంతరాలను పరిశీలిస్తారన్నారు. మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ ఆమోదం కోసం ఈనెల 5లోగా తుది జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు.

‘పది’ విద్యార్థులకు మెలకువల బోధన



ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న ఏవీఎన్ ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

దాబాగార్డెన్స్ : ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరు కానున్న ఏవీఎన్ హైస్కూల్ విద్యార్థులకు ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు మెలకువలు బోధించారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏవీఎన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంవీ భానుమతి, ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాసరావు, కనకమహాలక్ష్మి, భవానీ పాల్గొన్నారు.



ఒక్క క్లిక్‌తో సంపూర్ణ వైద్యం

సీఎం జగన్ తనను ప్రేమించే పేదలకు ప్రియమైన సేవలందిస్తున్నారు. వారికి ఏ కష్టం రాకూడదని.. వారు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకూడదని సమస్త సదుపాయాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా వారు అనారోగ్యానికి గురైనప్పుడు ఆస్పత్రుల వద్ద ఎలాంటి నిరీక్షణ లేకుండా సత్వరం వైద్యసేవలు పొందేలా ప్రభుత్వ పీహెచ్‌సీలను డిజిటలైజ్ చేశారు. దీంతో రోగుల రుగ్మతలు, వారి శారీరక పరిస్థితులు, అందజేసిన మందుల తాలూకు మొత్తం కేస్ హిస్టరీ నిక్షిప్తం అయిపోతుంది. ఆ రోగి రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఆధార్ కార్డు నంబర్ చెబితే చాలు అతని గత రికార్డు ద్వారా సులువుగా వైద్యం అందజేయటం వీలవుతుంది.

- డిజిటల్ పీహెచ్‌సీలతో సత్వర సేవలు
- రిజిస్ట్రేషన్ నుంచి పరీక్షలు.. వైద్యం వరకు నూతన ఒరవడి
- కొబ్బరితోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో అత్యాధునిక ట్రీట్‌మెంట్



కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



ట్యాబ్ ద్వారా రోగి వివరాలు డిజిటల్ విధానంలో తెలుసుకుంటున్న వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి

అల్లిపురం : ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే గంటల తరబడి పరీక్షలు, వైద్యం కోసం నిరీక్షించాల్సి వచ్చేది. అంత చేసినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉండేది కాదు. అందుబాటులో వైద్యులు ఉండేవారు కాదు. మందులు లభ్యమయ్యేవి కాదు. ప్రతి పని చిట్టీల పైనే జరిగేది. రోగి పేరు రాయటం దగ్గర నుంచి వైద్యుడు మందులు రాసిచ్చే వరకు అంతా రాతపనే. ఒకవేళ ఆ చిట్టీ పోతే రోగి వివరాలు, అతను వాడే మందుల వివరాలు తెలుసుకోవడం కష్టమయ్యేది. దీంతో మళ్లీ పరీక్షలు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రజల ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అత్యాధునిక వసతులతో పీహెచ్‌సీలు ఏర్పాటు చేసింది. ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటైంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది ఉచితంగా సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీలలో ప్రతి ఒక్క పని డిజిటలైజేషన్ చేయటంతో పేపర్‌లెస్ వర్క్ అందుబాటులోకి వచ్చింది. రోగి తన పేరు నమోదు చేసిన దగ్గర నుంచి అతనికి జరపాల్సిన పరీక్షలు, అందజేయాల్సిన మందుల వంటి వివరాలు ఆధార్ కార్డు ఆధారంగా మొత్తం నిక్షిప్తం చేస్తున్నారు. రోగి ఎప్పుడొచ్చినా ఆధార్ కార్డు నంబర్ చెబితే అప్పటి వరకు అతనికి గల వ్యాధులు, వాడిన మందుల హిస్టరీ బయటపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏ పీహెచ్‌సీకి వెళ్లినా అతని మెడికల్ హిస్టరీ తెలుసుకోవచ్చు. డిజిటలైజేషన్ ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందనేది వాస్తవం.

పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం..

కొబ్బరితోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం అందుబాటులోకి వచ్చింది. అవసరమైన వారికి అత్యవసర చికిత్సలు అందజేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి ఉండేలా ఏర్పాట్లు చేశారు. స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు వీలుగా చెవి, ముక్కు, గొంతు వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు, ప్రసూతి వైద్య నిపుణలు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, జనరల్ సర్జరీ వైద్య నిపుణులను రోజుకొకరు చొప్పున అందుబాటులోకి తీసుకువచ్చారు.

అందుబాటులో 60 రకాల పరీక్షలు..

ప్రస్తుత పరిస్థితుల్లో రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలు ఆధునికీకరించిన తర్వాత సుమారు 60 రకాల పరీక్షలు నిర్వహించేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పరీక్షల నిమిత్తం పేదలు ల్యాబ్‌లకు పరిగెత్తాల్సిన అవసరం కూడా లేకుండా చేశారు. పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను డిజిటలైజేషన్‌లో భాగంగా లబ్ధిదారుల డాటాబేస్‌లో భద్రపరచటంతో వారి హిస్టరీ అందుబాటులో ఉంటుంది. ఇదొక విప్లవాత్మక మార్పుగా భావించవచ్చు.



డిజిటల్ ట్యాబ్ ద్వారా పరీక్ష చేస్తున్న టెక్నీషియన్



పేర్లు నమోదు చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్

అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి..



పీహెచ్‌సీలకు రోజుకి ఒక స్పెషలిస్టు డాక్టర్ వస్తుంటారు. ఆ రోజు సంబంధిత వ్యాధితో బాధపడే వారు వచ్చి పరీక్షలు జరిపించుకుంటారు. అన్ని రకాల పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి మరింత మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తాం. రోజుకి కనీసం 60 నుంచి 80 మంది వరకు ఓపీకి వస్తుంటారు. – డాక్టర్ మహాలక్ష్మి, వైద్యాధికారి, కొబ్బరితోట పీహెచ్‌సీ

క్షేత్రస్థాయిలో సేవలందిస్తుంటాం..



క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్‌గా మా సేవలు అందిస్తుంటాం. మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తాం. ఇక్కడ పలువురు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారు. అవసరమైన వారికి పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నాం.

– నాగమణి, ఆశ వర్కర్, కొబ్బరితోట పీహెచ్‌సీ

వైద్యం బాగుంది..



పీహెచ్‌సీలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరించటంతో మంచి వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ప్రసాద్‌గార్డెన్స్, భీమ్‌నగర్ కేంద్రాలకు గాని కేజీహెచ్‌కు గాని ప్రతి చిన్న విషయానికి పరిగెత్తాల్సి వచ్చేది. ఇప్పుడు ఆధార్ కార్డు పట్టుకెళ్తే చాలు మన హిస్టరీ అంతా వైద్యులకు అర్థం అవుతుంది. గతంలో చిట్టీలు జాగ్రత్తగా దాచుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– బొడ్డు పోలారావు, లబ్ధిదారు

రూ.1.17 కోట్లతో కొత్త పీహెచ్‌సీ నిర్మించాం..



34వ వార్డుతో పాటు 32, 33 వార్డులకు గాను కొత్త పీహెచ్‌సీని రూ.1.17 కోట్లతో నిర్మించాం ముఖ్యమంత్రి ఆశయాల మేరకు అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పీహెచ్‌సీలో ఆధునిక వసతులు కల్పించాం. ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయి. స్పెషలిస్ట్ వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

సచివాలయాల్లో పెండింగ్ దరఖాస్తులు ఉండరాదు



మౌలాలీ పంజా సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : సచివాలయాల్లో దరఖాస్తులు పెండింగులో ఉండరాదని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ జోన్–4 పరిధి 39వ వార్డు థాంసన్ స్ట్రీట్, మౌలాలీ పంజా సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆయా శాఖల అధికారులకు పంపించాలన్నారు. అదే విధంగా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ముమ్మరం చేయాలన్నారు. సచివాలయల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులు ప్రజలకు తెలిసే విధంగా పెట్టాలన్నారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని జెడ్సీ హెచ్చరించారు. అనంతరం సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ. 21.78 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు టి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. 28 రోజులకుగాను రూ. 21.78 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 357 మిల్లీగ్రాములు, వెండి 168 గ్రాముల 300 మిల్లీగ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి. బోశన్ తెలిపారు. శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్.ప్రసాద్ ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

వాసుపల్లి దాతృత్వం



34వ వార్డులో ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



39వ వార్డులో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన సొంత నిధులతో 11 మందికి ఆర్థిక సాయం అందజేశారు. మంచాన పడిన పలువుర్ని శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేయడమే కాక మీకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున 11 మందికి రూ.55వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలే కాక తన సొంత నిధులతో నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటున్నానని చెప్పారు. ఎన్నికల ముందు వచ్చే డూప్లికేట్ నాయకుడిని కాదని, నిత్యం ప్రజా సేవలోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. 41వ వార్డు సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన అల్లిపిల్లి అమ్మాజీ, 33వ వార్డు వేంకటేశ్వరమెట్టకు చెందిన లంక ఉమాపతి, 34వ వార్డు అంబేడ్కర్ కాలనీకి చెందిన అంబటి నీలాద్రి, అదే వార్డు లక్ష్మీదేవిపేటకు చెందిన మైలపిల్లి రాజేష్, 28వ వార్డు పందిమెట్ట ప్రాంతానికి చెందిన ఇమంది పూజను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 30వ వార్డు జాలారిపేటకు చెందిన చేపల శివబాబు, పిల్లా అప్పయ్య వీధికి చెందిన పిల్ల ఎల్లయ్య, 37వ వార్డు పెయిందొరపేటకు చెందిన పాణమండ గంగరాజు, 39వ వార్డు చికలపేటకు చెందిన మరుపిల్లి అమ్మోరు, కృష్ణా టాకీస్‌కు చెందిన సందిపాటి దాసు, 34వ వార్డు అంబేడ్కర్ కాలనీకి చెందిన గొంతు లక్ష్మణరావుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పాఠశాలల పిల్లలతో రొటేరియన్ల ముచ్చట్లు



జీవీఎంసీ పాఠశాల విద్యార్థులతో రొటేరియన్లు

దాబాగార్డెన్స్ : సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రొటేరియన్లు కాసేపు జీవీఎంసీ పాఠశాలల పిల్లలతో ముచ్చటించారు. ప్రాథమిక విద్యార్థి దశ నుంచే విద్యార్థులు చైతన్యవంతులు కావాలని, అందుకు తమ వంతు బాధ్యతగా వారితో కాసేపు ముచ్చటించడమే కాక విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, జీవితం, విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించినట్టు రొటేరియన్లు ఆశాజ్యోతి, కరుణ పేర్కొన్నారు. పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు, పౌష్టికాహారం అందజేశారు. రొటేరియన్లు శివకుమార్, పల్లవి, రాజు, నిత్యజ్యోతి, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మెహరున్నీసా బేగం, దిలీప్‌కుమార్‌లను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మెహరున్నీసా బేగం, డి.దిలీప్‌కుమార్‌లను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో అభినందించారు. మెహరున్నీసా బేగం ఇటీవల జరిగిన సౌత్‌వెస్ట్ జోన్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. దిలీప్‌కుమార్ ఎన్‌సీసీ తరఫున 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని వీసీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ప్రొగ్రామ్ అధికారి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు

ప్రచార రథాలు ప్రారంభం..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు పల్స్ పోలియోపై అవగాహనకు ప్రచార రథాలు ప్రారంభించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద 25 ప్రచార రథాలను ప్రారంభించి మాట్లాడారు. నగర పరిధిలోని 8 జోన్లలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలపై విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలకుపోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఎమ్మెల్యే వాసుపల్లి భరోసా

- వారి కోసం తన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని అభయం



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మత్స్యకారులు

మహారాణిపేట : వివిధ తుపాన్ల తాకిడికి మునిగిపోయిన 36 బోట్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే విధంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు మత్స్యకార బోటు ఓనర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కార్యాలయంలో శనివారం అధిక సంఖ్యలో మత్స్యకారులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు మాట్లాడుతూ స్థానిక మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా గుర్తొచ్చేది వాసుపల్లి గణేష్‌కుమారే అన్నారు. ఆయనను మళ్లీ గెలిపించుకుని జగనన్న రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఇక్కడి ఫిషింగ్ డిపార్టుమెంట్ అధికారి జేడీ ద్వారా మునిగిన బోట్లకు లెక్క కట్టించి మత్స్యకారులకు అందాల్సిన న్యాయమైన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలను సీఎంవో ఆఫీస్‌కు అందజేశామన్నారు. పేదల ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా త్వరలో సీఎం రిలీఫ్ ఫండ్ కోటీ 37 లక్షలు అందిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భరోసా కల్పించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేయకూడదని చెబుతున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. శనివారం జోన్ పరిధిలో పర్యటించిన ఆయన జీవీఎంసీ 36వ వార్డు గొడారిగోతులు, మెయిన్ రోడ్డు, రెల్లివీధి జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. మానవవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను ఉపయోగించకూడదన్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం కనిపిస్తుందన్నారు. అనంతరం వార్డులోని వీధుల్లో పర్యటించి చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తడి–పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని ప్రజలకు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మీయ సభను విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్ : ఈ నెల 4న విశాఖలో నిర్వహించనున్న బీసీ ఆత్మీయ సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి కదిరి రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా నిర్వహించనున్న సభకు బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి జె. పూర్ణచంద్రరావు, పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి, పలువురు బీసీలు, బహుజన వాదులు, అంబేడ్కరీయులు, సామాజిక వాదులు పాల్గొంటారని తెలిపారు. బీసీల సమస్య, ఈ దేశపు సమస్య అని కాన్షీరాం అన్నట్టు 56 శాతం ఉన్న బీసీలు సంఘటితమైతేనే తప్ప సమస్యాత్మక భారతదేశపు తలరాత మారదని కదిరి రాము అన్నారు. 83 శాతం ఉన్న మహాజనులు ఏకం కావాలని, అప్పుడే పూలే, అంబేడ్కర్ ఆశయాల రాజ్యసిద్ధి లభిస్తుందని తెలిపారు.

బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం



బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశమైన నీలకంఠం

అల్లిపురం : రానున్న సార్వత్రిక ఎన్నికలకు మేము సైతం సిద్ధం అని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులు తెలిపారు. 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అధ్యక్షతన శనివారం బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్లో 33వ వార్డు బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కోర్ కమిటీ సభ్యులు ఆయా క్లస్టర్లలోని ఇళ్లకు వలంటీర్లు, గృహసారథులతో కలిసి వెళ్లాలని, కనీసం 60 శాతం ఓట్ షేర్ సాధించేలా చూడాలన్నారు. ఎన్నికల ముందు రోజు వరకు వలంటీర్లు, గృహసారథులు మ్యాప్ చేయబడిన అన్ని ఇళ్లను కనీసం 5 నుంచి 6 సార్లు సందర్శించేలా బూత్ అధ్యక్షులు పర్యవేక్షించాలన్నారు. పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, యల్లంకి చిన్నమ్మలు, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, నీలాపు అయ్యప్పరెడ్డి, కణితి బ్రహ్మం, సూరిశెట్టి శ్రీను పాల్గొన్నారు.